సాక్షి వైఎస్‌ఆర్ జిల్లా

బుధవారం, 2, అక్టోబర్, 2024



భూములిచ్చినందుకు మాపైనే కేసులా?
విజయవాడ – బెంగళూరు సిక్స్‌లైన్ రోడ్డు నిర్మాణ పనులకు భూమి ఇస్తే మాపైనే కేసు పెడతారా అని పులివెందులకు చెందిన రైతు వాపోతున్నాడు. -10లో



పేదలపై పగ సాధిస్తే పాలకులకు శంకరగిరి మాన్యాలే
పేదలపై పగ సాధించాలని చూస్తే పాలకు లకు శంకరగిరి మాన్యాలు తప్పవని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ హెచ్చరించారు. -10లో

గరిష్ఠం/కనిష్ఠం
37.0/25.4

వాతావరణం
జిల్లాలో మంగళవారం 25.4 – 37.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. – కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేటి నుంచి దసరా సెలవులు

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్య పాఠశాలలకు 2వ తేదీ నుంచి 13వ తేదీ వరకు దసరా సెలవులను ప్రకటించినట్లు డీఈఓ మర్రెడ్డి అనురాధ తెలిపారు. సెలవు దినాల్లో ఎవరైనా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలను నిర్వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని డీఈఓ హెచ్చరించారు. తిరిగి 14వ తేదీన పాఠశాలలు పునః ప్రారంభమౌతాయని అమె తెలిపారు.

ఇంటర్ కళాశాలలకు...
జిల్లావ్యాప్తంగా అన్ని యాజమాన్యాలకు సంబంధించిన ఇంటర్మీడియట్ జూనియర్ కళాశాలలకు 2వ తేదీ నుంచి 13వ తేదీ వరకు దసరా సెలవులను ప్రకటించినట్లు ఇంటర్మీడియట్ ఆర్ఐవో బండి వెంకటసుబ్బయ్య తెలిపారు.

14 నుంచి ఫొటో, వీడియోగ్రఫీలో శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్: కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీ నుంచి సెల్‌ఫోన్ రిపేరింగ్, సర్వీసింగ్‌తోపాటు ఫొటో, వీడియోగ్రఫీ, సీసీ కెమెరా రిపేరింగ్, సర్వీసింగ్‌లలో శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ ఆరీఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. సెల్‌ఫోన్ రిపేరింగ్, సర్వీసింగ్, ఫొటో, వీడియోగ్రఫీలో 30 రోజులపాటు, సీసీ కెమెరా రిపేరింగ్, సర్వీసింగ్‌లో 13 రోజులపాటు శిక్షణ ఇస్తారన్నారు. 18–45 సంవత్సరాల మధ్య వయస్సుగల నిరుద్యోగ యువతకు శిక్షణలో ప్రాధాన్యత ఇస్తారన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి శిక్షణా కాలంలో ఉచిత వసతి, సౌకర్యం కల్పిస్తారన్నారు. వివరాలకు 94409 05478, 99856 06866 నంబర్లలో సంప్రదించాలన్నారు.

75 మంది ఎక్సైజ్ కానిస్టేబుళ్ల బదిలీ

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: జిల్లాతో పాటు అన్నమయ్య జిల్లాలోని 75 మంది ఎక్సైజ్ కానిస్టేబుళ్లను బదిలీ చేస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సాధారణ బదిలీల్లో భాగంగా వీరిని బదిలీ చేసినట్లు అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బదిలీ అయిన అధికారులు తమ స్టేషన్లలో విధుల్లో చేరాలన్నారు.

నేడు జెడ్పీలో బెస్ట్ టీచర్ అవార్డులు

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా ప్రవేటు పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు గాంధీ జయంతిని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ఆపూస్మ) ఆధ్వర్యంలో బెస్ట్ టీచర్ అవార్డులను ప్రదానం చేస్తున్నట్లు ఆపూస్మ జిల్లా అధ్యక్షుడు గంగయ్య, ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి తెలిపారు. ఈ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని కడపలోని జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణ చైతన్య రెడ్డి, డీఈఓ అనురాధ హాజరవుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప కోటిరెడ్డిసర్కిల్: మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలో మిషన్ శక్తి పథకం ద్వారా నిర్వహిస్తున్న రిమ్స్ ఆవరణలోగల వన్‌స్టాప్ సెంటర్‌లో కాంట్రాక్టు పద్ధతిన పనిచేసేందుకు వివిధ ఉద్యోగాల భర్తీకి అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి తెలిపారు. పారా మెడికల్ (పర్సనల్), సెక్యూరిటీ గార్డు/నైట్ గార్డు ఒక్కొక్క పోస్టు చొప్పున ఖాళీగా ఉందన్నారు. పారా మెడికల్ ఉద్యోగానికి సంబంధిత రంగంలో డిగ్రీ/డిప్లొమా కలిగి ఉండాలన్నారు. జిల్లా స్థాయిలో వైద్య రంగానికి సంబంధించి కనీసం మూడు సంవత్సరాల అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఇస్తారన్నారు. ఎంపికైన వారికి రూ.19 వేలు వేతనం ఉంటుందన్నారు. సెక్యూరిటీ గార్డు/నైట్ గార్డు ఉద్యోగానికి సంబంధిత రంగంలో జిల్లా లేదా రాష్ట్ర స్థాయిలో రెండు సంవత్సరాల అనుభవం ఉండాలన్నారు. సైన్యంలో పనిచేసిన వారికి ప్రాధాన్యత ఇస్తారన్నారు. వివరాలతోపాటు దరఖాస్తుల కోసం హెచ్‌టీపీపీ://కడప.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌ను పరిశీలించాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 10వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా కార్యాలయ పనివేళల్లో కలెక్టరేట్ డి బ్లాక్‌లోని తమ కార్యాలయంలో సమర్పించాలని పీడీ సూచించారు.

వాసవీ.. వైభవం

- వరాల తల్లి.. కన్యాకా పరమేశ్వరి
- రేపటి నుంచి వైభవంగా దసరా ఉత్సవాలు ప్రారంభం
- పసిడిపురిలో అట్టహాసంగా దేవీ శరన్నవరాత్రి వేడుకలు
- ఉత్సవాల నిర్వహణలో ప్రొద్దుటూరుకు ప్రత్యేక స్థానం
- మైసూరు తరువాత ప్రొద్దుటూరులోనే ఘనంగా దసరా వేడుకలు

ప్రొద్దుటూరు కల్చరల్: శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి.. వరాల తల్లిగా భాసిల్లుతోంది. జిల్లా వ్యాప్తంగా దసరా వేడుకలకు వేళయింది.

దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహించడంలో రెండవ మైసూరుగా ప్రొద్దుటూరు పట్టణం పేరు గాంచింది. ఇక్కడ జరిగే దేవీశరన్నవ రాత్రి వేడుకలను తిలకించేందుకు రెండు తెలుగు రాష్ట్రాలు, కర్ణాటక, తమిళనాడు ప్రాంతాలకు చెందిన భక్తులు పట్టణానికి చేరుకుంటారు. పుత్తడిపురంగా పేరొందిన ప్రొద్దుటూరు అంటే గుర్తుకు వచ్చేది శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి ఆలయం. ఈ ఆలయంలో నిర్వహించే దసరా వేడుకలు ప్రఖ్యాతి గాంచాయి. గురువారం నుంచి 13వ తేదీ వరకు ఆర్యవైశ్య సభ ఆధ్వర్యంలో అట్టహాసంగా నిర్వహించనున్నారు. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలోని శ్రీవాసవీ మాత కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా భక్తుల కొంగు బంగారమై విరాజిల్లుతోంది. అమ్మవారిశాలను 1890లో నిర్మించారు. ఎత్తయిన గాలి గోపురం కలిగి, చక్కని శిల్ప కళా నైపుణ్యంలో పట్టణానికి శోభ చేకూర్చే విధంగా ఆలయాన్ని నిర్మించారు. పట్టణంలో జరిగే దసరా ఉత్సవాలు దేశంలోనే ప్రఖ్యాతి గాంచాయి. 1895 నుంచి దసరా ఉత్సవాలను ఆర్యవైశ్య సభ ఆధ్వర్యంలో అట్టహాసంగా నిర్వహిస్తున్నారు. దసరా ఉత్సవాల్లో విజయదశమినాడు నిర్వహించే శమీదర్శన గ్రామోత్సవం, అర్ధరాత్రి తొట్టి మెరవని అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి.



వజ్రపు చీర అలంకరణలో శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు (ఫైల్)

రోజూ ప్రత్యేక పూజలు
వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారికి రోజూ విశేష అభిషేకాలు, అర్చనలతోపాటు వాసవీ నిత్యహోమాన్ని లోకకల్యాణార్థం పండితులు చేస్తుంటారు. అమ్మవారికి ఏ ఆలయంలోలేని విధంగా పుత్తడి ఆభరణాలు, వజ్రపు చీరె, కిరీటం, బంగారు చీరె, ముత్యాలచీరెలు ఉన్నాయి. విశేష పర్వదినాల్లో అమ్మవారిని వీటితో అలంకరిస్తారు. ప్రతి సోమవారం సాయంత్రం గజవాహన సేవ, మంగళవారం సాయంత్రం సువర్ణ రజిత అష్టదళ పాదపద్మసేవ, బుధవారం వెండి ఊయలసేవ, గురువారం స్వర్ణరథసేవ, శుక్రవారం పల్లకిసేవ, శనివారం వెండి సింహాసనసేవ, ఆదివారం ఉదయం 108 కలశాలతో గో క్షీరంతో అభిషేకం, సాయంత్రం స్వర్ణరథసేవ నిర్వహిస్తారు.

ఆలయానికి ఘన చరిత్ర

ప్రొద్దుటూరు అమ్మవారిశాలకు ఘన చరిత్ర ఉంది. 1895 నుండి నిర్మాణ ఖర్చులతో కూడిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ఇక్కడి శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయాన్ని ఎందరో మహానుభావులు, జాతీయ, రాష్ట్ర రాజకీయ నాయకులు, పదవిలో ఉన్న వారు దర్శించుకున్నారు. 1929లో జాతిపిత మహాత్మ గాంధీ ఆలయాన్ని సందర్శించారు. కంచి కామకోటి పీఠాధిపతి చంద్రశేఖర సరస్వతి, జయేంద్ర సరస్వతిలు ఆలయంలో 40 రోజుల పాటు బస చేసి యజ్ఞయాగాదులు నిర్వహించారు. అమ్మవారి శాల గర్భగుడికి వెండి తొడుగులను అమర్చారు. ఆలయంలో శ్రీ వాసవి కన్యకాపరమేశ్వర దేవి జన్మ వృత్తాంతం తెలిపే చిత్రపటాలు దర్శనమిస్తాయి.



విద్యుత్ దీపకాంతులతో వెలుగొందుతున్న ప్రొద్దుటూరులోని అమ్మవారిశాల (ఫైల్)

రోజూ విశేషంగా అలంకారాలు
దసరా ఉత్సవాలు అక్టోబరు 3 నుంచి 13 వరకు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరిదేవిని ప్రతి రోజూ ఒక్కో రూపంలో అలంకరిస్తారు.

- 3న సాయంత్రం రాజరాజేశ్వరి దేవి, 4న భవాని దేవి, 5న శారదాదేవి, 6న అన్నపూర్ణాదేవి, 7న సాయంత్రం శ్రీదేవి వనవిహారిణి, రాత్రి బిల్వ వృక్ష వాసిని పార్వతీదేవి, 8న గజలక్ష్మీదేవి, 9న సరస్వతీదేవి, 10న మహిషాసుర మర్దినీ దేవి, 11న గాయత్రీదేవి, 12న విజయలక్ష్మీదేవి అలంకారం శమీదర్శన మహోత్సవం, అర్ధరాత్రి తొట్టి మెరవణి, 13న వాసవీ కన్యకాపరమేశ్వరిదేవిగా భక్తులకు దర్శన మివ్వనున్నారు.

అట్టహాసంగా అమ్మవారిశాలలో 134వ దసరా ఉత్సవాలు

శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో 134వ దసరా ఉత్సవాలను ఆర్యవైశ్య సభ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రాంమోహన్ రావు తెలిపారు. ఆలయంలో ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రాలను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరన్నవరాత్రుల సందర్భంగా గురువారం దసరా ప్రారంభ వేడుకలు అత్యంత వైభవంగా చేస్తామన్నారు. ప్రతి రోజూ వైభవోపేతంగా ప్రత్యేక కార్యక్రమాలతో ఉత్సవాలు సాగుతాయన్నారు. 12న విజయ దశమి సందర్భంగా శమీదర్శనం, తొట్టి మెరవణిలో కేరళ సింగారిమేళం, శక్తి వేషాలు, డూప్స్, హర్యానా వారి భంభం భోలే వేషధారణలు అలరిస్తాయన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ ఉపాధ్యక్షుడు జొన్నలగడ్డ రవీంద్రబాబు, కార్యదర్శి మురికి నాగేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, శంకర్, పోలేపల్లి రాజబాబు, ఓబులేసు, వెంకటేశ్వర్లు, రవీంద్ర, సుబ్బారావు, సాయికుమార్, బాలరాజు, పిచ్చయ్య, నవీన్‌కుమార్, జొన్నలగడ్డ రామచంద్ర ప్రకాష్, కెవీ.చలపతి తదితరులు పాల్గొన్నారు.



దసరా ఉత్సవాల ఆహ్వాన పత్రాలను విడుదల చేస్తున్న బుశెట్టి రామ్మోహన్ తదితరులు

దసరా స్పెషల్

- పండుగ సందర్భంగా ఆర్టీసీ విశేష ఏర్పాట్లు
- ఈనెల 4 నుంచి ప్రారంభం కానున్న ప్రత్యేక బస్సులు
- ఇతర ప్రాంతాల్లో ఉన్న వారు స్వస్థలాలకు వచ్చేందుకు చర్యలు
- కడప జోన్ పరిధిలోని ఎనిమిది జిల్లాల నుంచి ప్రత్యేక సర్వీసులు
- పండుగకు వచ్చేందుకు 790 సర్వీసులు

కడప కోటిరెడ్డిసర్కిల్: తెలుగువారు అత్యంత వైభవంగా పది రోజులపాటు నిర్వహించుకునే దసరా పండుగ సందర్భంగా ఏపీఎస్ ఆర్టీసీ అధికారులు విశేష ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాకు చెందిన అనేక మంది ఉద్యోగాలు, వ్యాపారాలు, ఇతర పనులు చేసుకుంటూ సుదూర ప్రాంతాల్లో నివసిస్తున్నారు. అలాంటి వారిలో అధికశాతం మంది పెద్ద పండుగగా పేర్కొనే దసరా సందర్భంగా తమతమ స్వస్థలాలకు రావడం, కుటుంబ సభ్యులతో కలిసి పండుగను ఘనంగా నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ప్రజల అవసరాల మేరకు ఏపీఎస్ ఆర్టీసీ అధికారులు ప్రత్యేక సర్వీసులు నడుపుతూ ప్రజల అవసరాలు తీరుస్తూనే మరోవైపు సంస్థ ఆదాయానికి తమవంతుగా కృషి చేస్తున్నారు.



ఆర్టీసీ బస్టాండులోని ప్లాట్‌ఫారాల వద్ద బస్సులు

దసరా సందర్భంగా కార్యచరణ ప్రణాళిక
కడప జోన్‌లోని ఎనిమిది జిల్లాల నుంచి దసరా పండుగ సందర్భంగా ప్రత్యేక బస్సులను అధికారులు నడిపేలా కార్యచరణ ప్రణాళిక సిద్ధం చేశారు. ప్రీ దసరా, పోస్ట్ దసరా పేరుతో అధికారులు ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు.

- కడప జోన్ పరిధిలోని 8 డిపోల నుంచి ప్రీ దసరా సందర్భంగా హైదరాబాదుకు 285 బస్సులు, బెంగుళూరు 224, విజయవాడ 76, చెన్నై 40 బస్సులతోపాటు ఇతర ప్రాంతాలకు 133 సర్వీసులు నడుపుతున్నారు.
- జోన్ పరిధిలోని అనంతపురం, శ్రీ సత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి, కర్నూలు, నంద్యాల డిపోల నుంచి అక్టోబరు 4న 43, 5న 44, 8న 89, 9న 120, 10న 192, 11న 302 బస్సులు కలిపి మొత్తం 790 బస్సులు నడుపుతున్నారు. అలాగే పండుగ ముగిసిన తర్వాత ఆయా డిపోల నుంచి విజయవాడకు 73, హైదరాబాదుకు 251, బెంగుళూరు 253, చెన్నై 23తోపాటు ఇతర ప్రాంతాలకు 32 సర్వీసులకు కలిపి మొత్తం 632 బస్సులను నడిపేలా చర్యలు చేపట్టారు.

సాధారణ ఛార్జీలతో ప్రత్యేక సర్వీసులు

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు కాక ముందు వరకు ఏపీఎస్ ఆర్టీసీ పండుగలు, ఇతర ప్రత్యేక సర్వీసుల్లో ప్రయాణించేవారికి అధిక ఛార్జిలు వసూలు చేసేవారు. కాగా ప్రైవేటు ట్రావెల్స్‌లో పరిస్థితులను బట్టి రెండింతలు, ఇంకా ఎక్కువ మొత్తంలో వసూలు చేసి నిలువుదోపిడీ చేసేవారు. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక ప్రజల ఇబ్బందులు గుర్తిస్తూ సాధారణ ఛార్జిలతోనే స్పెషల్ సర్వీసుల్లో ప్రయాణించేలా ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రయాణీకులకు ఎంతో ఉపశమనంగా ఉండేది. నాడు వైఎస్ జగన్ ప్రారంభించిన ఈ విధానాన్ని ఆర్టీసీ అధికారులు నేటికీ అమలు చేస్తున్నారు.

ప్రజలు స్పెషల్ సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలి



దసరా పండుగను పురస్కరించుకుని ప్రయాణీకుల సౌకర్యార్థం విశేష ఏర్పాట్లు చేశాము. హైదరాబాదు, బెంగుళూరు, చెన్నై, విజయవాడ తదితర ప్రాంతాలకు ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నాము. సురక్షిత ప్రయాణానికి ప్రజలు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని కోరుతున్నాం. – పొలిమేర గోపాల్‌రెడ్డి, రీజినల్ మేనేజర్, ఏపీఎస్ ఆర్టీసీ, కడప

రేపటి నుంచి ఏపీ టెట్ ఆన్‌లైన్ పరీక్ష

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ ఉద్యోగానికి అర్హత కోసం నిర్వహించే ఆంధ్ర ప్రదేశ్ టీచర్ ఎలిజిబులిటి టెస్టు(ఏపీటిట్)–2024ను జిల్లావ్యాప్తంగా ఈ నెల 3 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ కంప్యూటర్ బేస్డ్ పరీక్షకు విద్యాశాఖ అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసింది. జిల్లావ్యాప్తంగా కడప, పొద్దుటూరులలో ఉండే ఇంజనీరింగ్ కళాశాలలను పరీక్షా కేంద్రాలుగా ఎంపిక చేసింది. జిల్లావ్యాప్తంగా ఈ టెట్ పరీక్షను 23,044 మంది అభ్యర్థులు రాయనున్నారు. వీరందరికి ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్స్‌లో పరీక్షలను నిర్వహించనున్నారు.

సందేహాల నివృత్తికి...
టెట్ రాసే అభ్యర్థులకు ఏవైనా సందేహాలున్నా, పరీక్షా కేంద్రాల వివరాలను తెలుసుకునేందుకు విద్యాశాఖ హెల్ప్‌లైన్ నెంబర్లను ఏర్పాటు చేసింది. 94415 57508, 91333 56786, 98660 41341 నంబర్లకు కాల్ చేయవచ్చు.

పరీక్షా కేంద్రాల వివరాలు...

పరీక్ష కోడ్	పరీక్ష కేంద్రం	అభ్యర్థులు
1881	శ్రీనివాస ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ అండ్ సైన్సు, కడప	5174
1885	అన్నమాచార్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సు, కడప	775
2033	కేఎస్‌ఆర్‌ఎం కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, కడప	5000
2043	కేఎస్‌ఆర్‌ఎం ఆఫ్ ఇంజినీరింగ్, కడప	4050
3494	శ్రీ వెంకటేశ్వర ఇనిస్టిట్యూట్ సైన్సు అండ్ టెక్నాలజీ, కడప	2540
8934	కేఎల్‌ఎం ఇంజనీరింగ్ ఆఫ్ ఉమెన్స్, కడప	2693
1915	సాయి రాజేశ్వరి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, పొద్దుటూరు	2210
3477	శ్రీ చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, పొద్దుటూరు	600

కొత్త మద్యం పాలసీ అమలు

- జిల్లాలో 139 మద్యం దుకాణాలు
- ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ
- ఈనెల 9 సాయంత్రం 5 గంటల్లోపు సమర్పించాలి
- 11న జెడ్పీలో లాటరీ పద్ధతిన షాపుల కేటాయింపు
- కలెక్టర్ శివశంకర్ లోతేటి

కడప సెవెన్‌రోడ్స్: ప్రభుత్వం కొత్త మద్యం పాలసీ అమలు చేస్తోందని, ఇందుకోసం జీఓ 211 జారీ చేసిందని కలెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో 139 మద్యం షాపులు ఏర్పాటు చేస్తున్నామని, ఇందుకు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఒక వ్యక్తి ఎన్ని దరఖాస్తులైనా, ఎన్ని మద్యం షాపులకైనా దరఖాస్తు చేసుకునే వీలవుతుందన్నారు. ప్రతి దరఖాస్తుకు రూ. 2 లక్షలు చొప్పున ఫీజు చెల్లించాల్సి ఉంటుందని, మద్యం దుకాణం రాకపోయినా దీన్ని వాపసు ఇవ్వరని స్పష్టం చేశారు. మద్యం షాపులు పొందిన వారు ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే విక్రయాలు చేపట్టాల్సి ఉంటుందన్నారు. ప్రతి మద్యం షాపునకు అదనంగా సంవత్సరానికి రూ. 5 లక్షలు చెల్లిస్తే మోడల్ స్టోర్ ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఎక్కడైనా మద్యం దుకాణానికి దరఖాస్తులు రాకపోతే ఆ ప్రదేశాల్లో ప్రభుత్వం మద్యం దుకాణాలు ఏర్పాటు చేస్తుందన్నారు. ఈనెల 9వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఈనెల 11వ తేది జిల్లా పరిషత్‌లో లాటరీ ద్వారా షాపుల కేటాయింపు జరుగుతుందన్నారు. సందేహాలుంటే కలెక్టరేట్ కంట్రోల్ రూము (08562-246344)లో సంప్రదించాలన్నారు. ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ జయరాజు మాట్లాడుతూ గుగూల్ ద్వారా దరఖాస్తుల సమర్పణ, ఫీజుల చెల్లింపునకు సౌలభ్యం ఉందన్నారు. దరఖాస్తుతోపాటు రెండు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు, ఓటరు ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్టు, బ్యాంకు పాస్ పుస్తకం, ఆధార్ కార్డులలో ఏదో ఒకటి సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఈ సమావేశంలో పలువురు ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి

ఫ్రీ హోల్డ్ భూములను నిశితంగా పరిశీలించండి
ఫ్రీ హోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లను నిశితంగా పరిశీలించాలని రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. మంగళవారం రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్ శాఖామంత్రి మంగళగిరిలోని సీసీఎల్‌ఏ ఆఫీసు నుండి ఫ్రీ హోల్డ్ భూములపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ శివశంకర్ మాట్లాడుతూ జిల్లాలో ఫ్రీ హోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లను పరిశీలించామన్నారు. అక్రమాలు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జేసీ అదితిసింగ్, డీఆర్వో గంగాధర్ గౌడ్, జిల్లా రిజిస్ట్రార్ పీవీఎస్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు నైతిక విలువలు నేర్పాలి
చిన్నతనం నుంచే పిల్లలకు నైతిక విలువలు నేర్పితే పెద్దయ్యాక వృద్ధాప్యంలోని తల్లిదండ్రులను గౌరవించి సేవలు అందిస్తారని కలెక్టర్ శివశంకర్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో వికలాంగుల సంక్షేమశాఖ ఏడీ కృష్ణ కిశోర్, డీఆర్‌డీఏ పీడీ ఆనంద్ నాయక్, జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల సవరణ జాబితా సిద్ధం చేస్తున్నాం

ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా–2025ను ఎలాంటి ఆలస్యం లేకుండా సిద్ధం చేస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి శివశంకర్ తెలిపారు. మంగళవారం ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్, ఓటర్ల సర్వే తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్, కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో శివశంకర్ మాట్లాడారు. ఇంటింటి ఓటర్ల సర్వే ప్రక్రియ జిల్లాలో 99.45 శాతం పూర్తయిందని తెలిపారు. ఎన్నికల కమిషన్ సూచనల మేరకు ఈనెల 29వ తేదీ నాటికి ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా సిద్ధం చేస్తామన్నారు.

కేసీ కాలువలో ఇద్దరు బాలురు గల్లంతు

- ఒకరి మృతదేహం లభ్యం
- మరొకరి కోసం గాలింపు

మైదుకూరు: కాలువలో సరదాగా ఈత కొట్టాలనుకున్నారో ఏమో అభం శుభం తెలియని ఇద్దరు బాలురు కేసీ కాలువలో గల్లంతైన సంఘటన మైదుకూరులో జరిగింది. సంఘటనలో ఒక బాలుడి మృతదేహం కాలువలో దొరికింది. మరొక బాలుడి ఆచూకీ కోసం గాలిస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని శాంతినగర్ ప్రాంతంలో ఆవులోళ్ల కాలనీకి చెందిన మక్తుమ్ కుమారుడు ఆసిన్(10), మాలిక్ కుమారుడు రఫీ (10) అనే ఇద్దరు బాలురు మంగళవారం సాయంత్రం సమీపంలోని కేసీ కాలువైన కొండపేట ఛానల్ వద్దకు వెళ్లారు. చీకటి పడిన తర్వాత పిల్లలు ఇంటికి రాకపోయేసరికి తల్లిదండ్రులు వారి కోసం వెతికారు. శాంతినగర్ సమీపంలో వెళుతున్న కొండపేట కాలువ వద్ద పిల్లల బట్టలు కనిపించడంతో ఈత కోసం కాలువలోకి దిగి ఉంటారని భావించారు. కాలువలో మునిగిపోయారేమోనని కాలువ వెంబడి వెతకగా స్థానిక బద్వేలు రోడ్డులో జాతీయ రహదారి బ్రిడ్జి వద్ద ఆసిన్ అనే బాలుడి మృతదేహంహం కనిపించింది. సంఘటనపై పిల్లల తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు అర్బన్ సీఐ సయ్యద్ హాసం కేసీ కాలువ అధికారులతో మాట్లాడారు. కాలువలో నీటి ప్రవాహాన్ని తగ్గించాలని కోరారు. ఆ మేరకు కేసీ ప్రధాన కాలువ నుంచి కొండపేట కాలువ ప్రారంభమయ్యే చోట షట్టర్లను దించి ప్రవాహాన్ని తగ్గించారు. గల్లంతైన మరో బాలుడి రఫీ కోసం గాలిస్తున్నారు.



మృతి చెందిన బాలుడు ఆసిన్

క్లుప్తంగా

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప రైల్వేస్టేషన్ దిగువ రైలు పట్టాలపై మంగళవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి చెన్నై–ముంబయి రైలు బండి కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు కడప రైల్వే హెడ్ కానిస్టేబుల్ అయ్యూబ్ తెలిపారు. మృతుడు 45–50 సంవత్సరాల వయస్సు కలిగి ఉంటాడని, కుడి చేయిపై త్రిశూలం ఆకుపచ్చ బొట్టు ఉన్నదని, ఎర్రటి మొలతాడు ఉందని తెలిపారు. మృతదేహం వద్ద ఒక ఇత్తడి ఉంగరం ఎర్రరాయి పొదగబడి ఉందన్నారు. మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించాలని తెలిపారు.

జేసీబీ, టిప్పర్లు స్వాధీనం

రాజుపాళెం : మండలంలోని చిన్నశెట్టిపల్లె గ్రామంలో అక్రమంగా మట్టిని తరలిస్తున్న జేసీబీ, టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కత్తి వెంకటరమణ మంగళవారం తెలిపారు. మట్టిని అక్రమంగా ప్రొద్దుటూరు పట్టణానికి తరలిస్తున్నారని పేర్కొన్నారు. అలాగే వాహన తనిఖీల్లో భాగంగా మరొక టిప్పర్ అక్రమంగా రవాణా చేస్తుండటంతో స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ చెప్పారు. అందుకు సంబంధించిన వ్యక్తులపై కేసు నమోదు చేసి జేసీబీ, టిప్పర్ల పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు.

ఆర్టీసీ బస్టాండులో వ్యక్తి మృతి



బస్టాండులో వలీసాహెబ్ మృతదేహం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప ఆర్టీసీ బస్టాండులో ఓ వ్యక్తి మృతి చెందాడని చిన్నచౌకు ఏఎస్ఐ అబ్రహం తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు...కడప నగరం రవీంద్రనగర్‌కు చెందిన షేక్ వలీ సాహెబ్ (53) మంగళవారం రిమ్స్‌కు వెళ్లి వైద్య సేవలు పొందడన్నారు. అనంతరం ఆర్టీసీ బస్టాండుకు చేరుకుని సేద తీరుతూ ఉన్నట్లుండి కూర్చొలోనే కూలబడి మృతి చెందాడన్నారు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారని, ఈ మేరకు ఆర్టీసీ కానిస్టేబుల్ రవి, రమాదేవిలు మృతుని బంధువులకు సమాచారం అందించి మృతదేహాన్ని అప్పగించారు. ఈ మేరకు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు కొత్తపల్లె విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం, టీచర్లు

వేముల : జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ సబ్ జూనియర్స్ జట్టుకు వేముల మండలం వి.కొత్తపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని ఆ పాఠశాల హెడ్మాస్టర్ నరసింహారావు మంగళవారం తెలిపారు. ఎంపికైన విద్యార్థులు నవంబర్ 8వ తేదీ నుంచి 12వ తేదీవరకు జమ్మూ కశ్మీర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు.

భూములిచ్చినందుకు మాపైనే కేసులా?



నష్టపరిహారం అందించాలని కారు కింద పడుకున్న రైతు నారాయణస్వామి



దుమ్ము, ధూళికి ఎండిపోయిన మిరప పంట

- పంట భూముల్లో దుమ్ము, ధూళి నింపుతున్న దిలీప్ బిల్కాన్
- నష్టపరిహారం అందించకపోతే ఆత్మహత్యే శరణ్యమంటున్న రైతు

పులివెందుల రూరల్ : పులివెందుల మండల పరిధిలోని వెలమవారిపల్లె గ్రామ సమీపంలో విజయవాడ – బెంగళూరు సిక్స్‌లైన్ రోడ్డు నిర్మాణ పనులను దిలీప్ బిల్కాన్ సంస్థ చేపడుతోంది. పులివెందులకు చెందిన మధుసూదన్‌రెడ్డికి చెందిన ఐదు ఎకరాల పొలాన్ని నారాయణస్వామి అనే వ్యక్తి కౌలుకు తీసుకుని మిరప పంటను సాగు చేశాడు. పంట సాగు చేసినప్పటి నుంచి సిక్స్‌లైన్ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతుండటంతో దుమ్ము, ధూళి పట్టి పంట ఎందుకు పనికిరాకుండా పోయిందని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. మంగళవారం సిక్స్‌లైన్ రోడ్డు పనులు జరుగుతున్న ప్రాంతంలో వాహనాలు వెళ్లకుండా రైతు నారాయణస్వామి అడ్డంగా పడుకుని నిరసన తెలిపాడు. పంటకు నష్టపరిహారం అందించాలని సంబంధిత కంపెనీ నిర్వాహకులకు, రెవెన్యూ అధికారులకు, వ్యవసాయ శాఖ అధికారులకు విన్నవించినట్లు తెలిపాడు. వ్యవసాయ అధికారులు కూడా పంట వద్దకు వచ్చి పంటను పరిశీలించి దుమ్ము, ధూళివల్ల పంట పూర్తిగా దెబ్బతిందని చెప్పారన్నారు. నష్టపరిహారం అందించాలని అనేకమార్లు చెప్పినా సంబంధిత కాంట్రాక్టర్ పట్టించుకోలేదని రైతు వాపోతున్నాడు. పంట సాగు చేసేందుకు అప్పులు తెచ్చి ఎరువులు, మందులకు, డ్రిప్ పైపులకు, మిరప నారకు సుమారు రూ.7లక్షల దాకా ఖర్చు చేశామన్నారు. నష్టపోయిన మిరప పంటకు నష్టపరిహారం అందించకపోతే ఆత్మహత్యే శరణ్యమని రైతు వాపోతున్నాడు.

భూమి ఇచ్చినందుకు మాపై కేసులా? :

విజయవాడ – బెంగళూరు సిక్స్‌లైన్ రోడ్డు నిర్మాణ పనులకు భూమి ఇస్తే మాపైనే కేసు పెడతారా అని రైతు వాపోతున్నాడు. రోడ్డు నిర్మాణ పనులకు కొంత భూమి పోనూ, మిగిలిన ఐదు ఎకరాలలో మిరప పంట సాగు చేశానని, పంట రోడ్డు నిర్మాణ పనులు చేస్తుండటంవల్ల దుమ్ము, ధూళి పట్టి ఎందుకు పనికి రాకుండా పోయిందన్నారు. పంట నష్టపరిహారంకు సంబంధించి డబ్బులు అడిగితే దిలీప్ బిల్కాన్ కంపెనీ నిర్వాహకులు రైతుల మీదనే కేసులు నమోదు చేస్తున్నారని రైతు ఆవేదన చెందుతున్నాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నష్టపరిహారం అందించాలని రైతు కోరుతున్నాడు.

భర్త వేధింపులు తాళ లేక భార్య ఆత్మహత్య



పల్లా కీర్తి (ఫైల్)

ప్రొద్దుటూరు క్రైం : భర్త వేధింపులను భరించలేక పల్లా కీర్తి (27) అనే వివాహిత ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సూపర్‌బజార్ వీధిలో చోటు చేసుకుంది. త్రీ టౌన్ పోలీసులు తెలిపిన మేరకు.. పట్టణంలోని సూపర్‌బజార్ వీధికి చెందిన కీర్తికి ఏడు నెలల క్రితం కడపలోని ఎర్రముక్కపల్లెలో నివాసం ఉంటున్న బొమ్మిశెట్టి విజయ్‌కుమార్‌తో వివాహం అయింది. అతను హైదరాబాద్‌లోని కాంట్రాక్టర్ వద్ద గుమాస్తాగా పని చేస్తాడు. పెళ్లి అయిన తర్వాత భార్యభర్తలు హైదరాబాద్‌లోనే నివాసం ఉండేవారు. విజయ్‌కుమార్‌కు పెళ్లి కాకముందే మరో మహిళతో వివాహేతర సంబంధం ఉండేది. ఈ విషయమై భార్యాభర్తలు తరచూ గొడవ పడేవారు. ఈ క్రమంలోనే అతను భార్య కీర్తిని వేధింపులకు గురి చేసేవాడు. బంధువుల పెళ్లి ఉండటంతో కీర్తి నాలుగు రోజుల క్రితం ప్రొద్దుటూరులోని పుట్టింటికి వచ్చింది. భర్త వేధిస్తున్న విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పుకొని రోధించింది. ఈ క్రమంలో సోమవారం రాత్రి ఇనుప పైపునకు చీరకట్టుకొని కీర్తి ఉరేసుకుంది. కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా అప్పటికే ఆమె మృతి చెందింది. తల్లి వెంకటనరసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు త్రీ టౌన్ ఎస్ఐ వెంకటరెడ్డి తెలిపారు.

జెలిటిన్ స్టిక్స్ కోసం లోతుగా పోలీసుల దర్యాప్తు

- ముగ్గురాయి మైనింగ్‌లపై దాడుల ముమ్మరం
- వేములలో మైనింగ్ వద్ద దాచిన జెలిటిన్ స్టిక్స్ స్వాధీనం
- నిందితుడిని విచారిస్తున్న పోలీసులు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : వేముల మండలంలోని వి.కొత్తపల్లె గ్రామంలో వీఆర్ఏ హత్యకు ఉపయోగించిన జెలెటిన్ స్టిక్స్ ఎక్కడి నుంచి వచ్చాయో అనే దానిపై పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. వి.కొత్తపల్లె గ్రామంలో ఆదివారం రాత్రి జెలెటిన్ స్టిక్స్ పేల్చి వీఆర్ఏని హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ హత్యకు వివాహేతర సంబంధమే కారణమైనప్పటికి హత్యకు ఉపయోగించిన జెలెటిన్ స్టిక్స్ నిందితునికి ఎలా వచ్చాయనే దానిపై పోలీసులు దృష్టి సారించారు. నిందితుడు వేముల, వేంపల్లె, వీరపునాయునిపల్లె మండలాల్లోని ముగ్గురాయి మైనింగ్‌లలో కూలీ పనులకు వెళ్లేవాడు. విచారణలో నిందితుడు జెలెటిన్ స్టిక్స్ ఎక్కడ నుండి తెచ్చినాడో పోలీసులకు చెప్పలేదని సమాచారం . నిందితుడు ఒక్కసారి వేములలో అని, మరోసారి వేంపల్లె మండలంలోనూ, ఇంకోకసారి వీరపునాయునిపల్లె మండలంలోని రాజుపాలెం గ్రామంలోనూ తెచ్చానని పోలీసుల విచారణలో చెబుతున్నట్లు సమాచారం. ఆదివారం నుంచి పోలీసులు జెలెటిన్ స్టిక్స్ నిందితునికి ఎక్కడ నుంచి వచ్చాయనే దానిపై విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది. విచారణలో నిందితుడు చెప్పిన చోటికి పోలీసులు జెలెటిన్ స్టిక్స్ కోసం దాడులు చేస్తున్నట్లు సమాచారం. ఇందులో భాగంగా సోమవారం నిందితుడు చెప్పిన ముగ్గురాయి మైనింగ్ వద్దకు వెళ్లిన పోలీసులు మూడు బాక్స్‌లు జెలెటిన్ స్టిక్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. మైనింగ్ వద్ద ఉన్న వాచ్‌మెన్ సెల్‌ఫోన్‌ను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. మైనింగ్ సంబంధించిన వ్యక్తిని మంగళవారం రాత్రి పోలీసులు జెలెటిన్ స్టిక్స్ ఎలా వచ్చాయనే దానిపై విచారణ చేస్తున్నట్లు సమాచారం. దీనిపై ఇంకా స్పష్టత రాలేదని తెలిసింది.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్

కొండాపురం : మండల పరిధిలోని బెడుదూరు యనమలచింతల గ్రామాలకు వెళ్లే నాలుగు రోడ్ల కూడలి సమీపంలో మూడు పంచలోహ విగ్రహాలు అమ్మకానికి తీసుకెళుతుండగా తాళ్ల ప్రొద్దుటూరు ఎస్ఐ హృషికేశవరెడ్డి ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు మంగళవారం తెలిపారు. బెడుదూరు గ్రామంలో లక్ష్మీవెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం రాత్రి పురాతన వెంకటేశ్వరస్వామి, శ్రీదేవి భూదేవి అమ్మవారి పంచలోహ విగ్రహాలు చోరీ అయ్యాయి. ఈ చోరీ ఘటనలో వెంకట సుబ్బయ్య, వి.వెంకటరమణ, వి. రాజులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి విగ్రహాలను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

రిమ్స్ మార్చురీలో గుర్తు తెలియని మృతదేహాలు



కడప రిమ్స్ మార్చురీలో ఉన్న మృతదేహాలు

కడప అర్బన్ : కడప నగర శివార్లలో ప్రభుత్వ సర్వజన వైద్య శాలలో చికిత్స పొందుతూ మృతి చెందిన నలుగురు వృద్ధుల మృతదేహాలు రిమ్స్ మార్చురీలో ఉన్నాయి. వీరి ఆచూకీ తెలిసిన వారు తగిన ఆధారాలతో తమ దృష్టికి తీసుకుని రావాలనీ రిమ్స్ అధికారులు తెలియజేశారు.

రాజకీయ లబ్ధికోసమే

లడ్డూ కల్తీపై వ్యాఖ్యలు

- భక్తులకు క్షమాపణలు చెప్పాలి
- ఎమ్మెల్సీ పి. రామసుబ్బారెడ్డి



జమ్మలమడుగు రూరల్ : రాజకీయ లబ్ధి కోసమే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తిరుమల లడ్డూ తయారీలో జంతువుల కొవ్వు కల్తీ చేశారన్న వ్యాఖ్యాలు చేశారని ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి విమర్శించారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ వందరోజుల పాలనలో ప్రభుత్వం ఏదో ఘనకార్యం సాధించిందని చెప్పుకుంటున్నారన్నారు. దశాబ్దాల రాజకీయ అనుభవం కలిగిన చంద్రబాబు నాయుడు తిరుమల లడ్డూలో కల్తీ జరిగిందని చెప్పడంతో ప్రపంచంలోని కోట్ల మంది భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. లడ్డూలో ఎక్కడా కల్తీ జరుగలేదని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పదే పదే చెబుతున్నా.. కేవలం రాజకీయ స్వార్థం కోసం ముఖ్యమంత్రి హోదాలో ఉన్న చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలకు భక్తులు తీవ్ర ఆందోళనకు గురి కావడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులైనా ప్రజలకు ఎటువంటి పథకాలు అమలు చేయలేదు. దీంతో ప్రజల్లో అసమ్మతి వస్తుందన్న ఆలోచనతో ప్రభుత్వం ప్రజల దృష్టిని మరలించేందుకు తిరుమల లడ్డూ కల్తీ జరిగిందని ప్రచారానికి తెరతీశారన్నారు. ప్రజలను మోసగించేందుకు సూపర్ 6 హామీలు ఇచ్చి ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక అసెంబ్లీలో రాష్ట్రం రూ. 10 లక్షల కోట్లు అప్పులు ఉన్నాయని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. దేశంలో అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్ట్ కూడా ముఖ్యమంత్రి పదవిలో ఉండి తిరుమల లడ్డూ విషయంలో కల్తీ జరిగిందని మాట్లాడటం తగదని చెప్పిందని గుర్తు చేశారు. ఇప్పటికైన ఎన్‌డీఏ కూటమి నాయకులైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఆయన హితవు పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పొన్నపురెడ్డి గిరిధర్‌రెడ్డి, ఉప్పలపాడు శ్రీనివాసులురెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు పెంచితే మరో బషీర్‌బాగ్ ఉద్యమం



విద్యుత్ చార్జీల పెంపుపై వచ్చిన కథనాన్ని చూపుతున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు

ప్రొద్దుటూరు : తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలను పెంచబోమని ఊరు వాడ చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారంలోకి వస్తూనే విద్యుత్ భారాన్ని ప్రజలపై మోపేందుకు రంగం సిద్ధం చేశారని వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. ప్రజలపై విద్యుత్ చార్జీల భారాన్ని మోపితే మరో బషీర్‌బాగ్ ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ఆయన మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ విద్యుత్ చార్జీలను పెంచేందుకు చంద్రబాబు కుంటిసాకులు చెబుతున్నారని మండిపడ్డారు. ఎన్నికలప్పుడు విద్యుత్ చార్జీలను పెంచే ప్రసక్తే లేదని చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చి వంద రోజులు కాకముందే మాట తప్పుతున్నారని విమర్శించారు. విద్యుత్ చార్జీల పెంపు ద్వారా ప్రజలపై సుమారు రూ.20వేల కోట్ల భారాని మోపేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వెల్లడించారు. ఇందులో భాగంగానే వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.8,113 కోట్లు విద్యుత్ చార్జీలను పెంచేందుకు ఏపీ రెగ్యులేటరి కమిషన్ ద్వారా సమావేశాలు నిర్వహించడం జరుగుతోందన్నారు.

సంక్షేమ పథకాలు ఏమయ్యాయి?

రైతు భరోసా, అమ్మ ఒడి, నేతన్న నేస్తం లాంటి సంక్షేమ పథకాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. వచ్చే ఏడాది నుంచి సంక్షేమ పథకాలను అమలు చేస్తామని చెప్పిన చంద్రబాబు వంద రోజుల్లోపే మద్యం పాలసీని ఎలా అమలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

తిరుమల లడ్డూపై దుష్ప్రచారం

తిరుమల లడ్డూపై చంద్రబాబు దేశ వ్యాప్తంగా దుష్ప్రచారం చేశారని రాచమల్లు తెలిపారు. లడ్డూలో ఎలాంటి కల్తీ జరగకపోయినా జరిగినట్లు ప్రచారం చేశారన్నారు. లడ్డూ వ్యవహారంలో చంద్రబాబు వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిందని గుర్తుచేశారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్, హౌస్ బిల్డింగ్ సొసైటీ చైర్మన్ ద్వార్శల భాస్కర్‌రెడ్డి, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యులు చిప్పగిరి ప్రసాద్, టంగుటూరు మారుతిప్రసాద్, కౌన్సిలర్లు ముదిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, సత్యం, గరిశపాటి లక్ష్మీదేవి, లావణ్య, పాతకోట మునివంశీధర్‌రెడ్డి, నాగేంద్రారెడ్డి పాల్గొన్నారు.

పీజీ వైద్య విద్యార్థుల ప్రతిభ



అనస్తీషియా విభాగం పీజీ వైద్య విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ

కడప అర్బన్ : రాష్ట్ర స్థాయి వైద్య సదస్సులో కడప ప్రభుత్వ వైద్యకళాశాల నుంచి అనస్తీషియా పీజీ వైద్య విద్యార్థులు పాల్గొని ఉత్తమ పేపర్ అవార్డులను పొందారు. సెప్టెంబర్ 27 నుంచి 30 తేదీ వరకు తిరుపతిలో రాష్ట్ర స్థాయి అనస్తీషియా సదస్సు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఇతర రాష్ట్రాల నుంచి 50 వైద్య కళాశాలల నుంచి పోస్ట్‌గ్రాడ్యుయేట్ విద్యార్థులు సదస్సులో పాల్గొన్నారు. కడప ప్రభుత్వ వైద్య కళాశాల నుంచి హాజరైన పీజీ వైద్య విద్యార్థులలో డాక్టర్ వీరమల్ల పూజ, డాక్టర్ కందాల శ్రీకావ్య, డాక్టర్ అన్నామలై రామమూర్తి, డాక్టర్ ఎం. సంధ్యారాణి, డాక్టర్ శ్రీలేఖ, డాక్టర్ బెబ్రి, డాక్టర్ సందీప్ ఉత్తమ అవార్డులు పొందారు. వీరిని మంగళవారం కడప ప్రభుత్వ వైద్య కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి, అనస్తీషియా హెచ్ఓడి డాక్టర్ సునీల్ చిరువెళ్ల, వైద్యులు అభినందించారు.

డీసీఈబీ భవన నిర్మాణ పనులను చేపట్టాలి

ఫ్యాప్టో జిల్లా చైర్మన్ మాదన విజయ కుమార్ డిమాండ్

కడప ఎడ్యుకేషన్ : కడపలో జిల్లా ఉమ్మడి పరీక్షా కేంద్ర భవన (డీసీఈబీ) నిర్మాణాన్ని తక్షణమే చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) కడప జిల్లా చైర్మన్ మాదన విజయ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం కడపలోని సీఎస్ఐ హైస్కూల్ ఆవరణలో ఫ్యాప్టో జిల్లా శాఖ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉన్న డీసీఈబీ భవనం గతంలో బుగ్గ వంక విస్తరణ పనులలో కూల్చివేతకు గురైందని తెలిపారు. డీసీఈబీ వద్ద దాదాపు 80 లక్షల రూపాయల పైబడి నిధులు కూడా ఉన్నాయన్నారు. అయినప్పటికీ భవన నిర్మాణ పనులను ప్రారంభించడంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారని ఆరోపించారు. సొంత భవనం లేకపోవడం వల్ల కార్యకలాపాల నిర్వహణకు తీవ్ర ఇబ్బందికరంగా ఉందన్నారు. సమావేశంలో ఫ్యాప్టో జిల్లా సెక్రెటరీ జనరల్ షేక్ మహమ్మద్ ఇర్షాద్, ట్రెజరర్ ఎస్ఎండి. ఇలియాస్ భాష, ఏపీటీఎఫ్ (257) జిల్లా అధ్యక్షులు టి.ఖాదర్ భాషా, ఏపీటీఎఫ్ (1938) జిల్లా అధ్యక్షులు ఆర్.అబ్దుల్లా, యుటిఎఫ్ జిల్లా ట్రెజరర్ కె.నరసింహారావు, ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు జి.వెంకటసుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంటు ఏర్పాటు చేసే వరకు పోరాటం



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అఖిలపక్ష నేతలు

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్ర విభజన చట్టం ప్రకారం జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేసేంత వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని అఖిలపక్ష నాయకులు నారాయణరెడ్డి, ఎస్ఏ సత్తార్, సగిలి గుర్రప్ప, జాలా జయవర్ధన్, శంకర్‌లు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ అంశంపై మంగళవారం కోటిరెడ్డిసర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శనగా వెళ్లి ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ జిల్లాలోని ప్రజాప్రతినిధులు రాజకీయాలకు అతీతంగా ఉక్కు పరిశ్రమ సాధనకు నడుం బిగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు సీఆర్‌వీ ప్రసాద్, ఓరుగంటి నాగేంద్రబాబు, రాజేంద్ర, నరసింహా, భాస్కర్, దేవర శ్రీకృష్ణ, దస్తగిరి, మైనుద్దీన్, డీఎం ఓబులేశు తదితరులు పాల్గొన్నారు.

గాంధీ జయంతికి ఖైదీల విడుదల లేనట్లే

కడప అర్బన్ : జాతిపిత మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని సత్ప్రవర్తన కలిగిన ఖైదీలను విడుదల చేసే సంప్రదాయం గతంలో కొన్నిసార్లు అమలు చేశారు. ఈ క్రమంలోనే గత ఏడాది నుంచి ఇప్పటి వరకు సత్ప్రవర్తన కలిగిన 20 మంది ఖైదీల జాబితాను కడప కేంద్ర కారాగార అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు. రాష్ట్ర స్థాయిలో హోంశాఖ, డీజీపీ, జైళ్ల శాఖ తదితర అధికారుల బృందంతో ఎవరెవరిని విడుదల చేయాలనీ కమిటీ నిర్ణయిస్తుంది. ఈక్రమంలో విడుదల చేసే జీవో ఆధారంగా ఆయా కేంద్రకారాగారాల నుంచి సత్ప్రవర్తన ఖైదీలను విడుదల చేస్తారు. ఈ ఏడాది ఇప్పటివరకు ఈ విధానంపై ఎలాంటి సమాచారం లేదని కారగార అధికారులు తెలియజేస్తున్నారు. దీంతో ఈ ఏడాది కారాగారం నుంచి ఖైదీల విడుదల లేనట్లేననీ సమాచారం.

పేదలపై పగ సాధిస్తే పాలకులకు శంకరగిరి మాన్యాలే

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



బహిరంగ సభలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

బద్వేలు అర్బన్ : భూ కబ్జాదారులను వదిలేసి పేదలపై పగ సాధించాలని చూస్తే ఈ పాలకులకు కూడా శంకరగిరి మాన్యాలే తప్పవని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ హెచ్చరించారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆధ్వర్యంలో పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో మంగళవారం నిర్వహించిన భూ బాధితుల జిల్లాస్థాయి బహిరంగసభలో ఆయన మాట్లాడుతూ గతంలో జరిగిన భూ కబ్జాల కంటే ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో బద్వేలు నియోజకవర్గంలో భూ కబ్జాలు అధికమవడంతో పాటు దళితులపై దాడులు, దౌర్జన్యాలు అధికమయ్యాయని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళతామని అన్నారు. అలాగే దళితులపై దాడి చేసిన టీడీపీ నాయకులను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఓబులేసు, జి.ఈశ్వరయ్యలు మాట్లాడుతూ బద్వేలు నియోజకవర్గంలో కాశినాయన మండలం నుండి అట్లూరు మండలం వరకు వేలాది ఎకరాల ప్రభుత్వ భూములు కబ్జాకు గురైతే రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తుండటం దారుణమన్నారు. రెవెన్యూ అధికారులు భూ కబ్జాదారులపై చర్యలు తీసుకుని తమ నిజాయితీని నిరూపించుకోవాలని అన్నారు. అలా కాకుండా భూ కబ్జాదారులను వదిలేసి పేదల జోలికి వస్తే మాత్రం తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. తొలుత స్థానిక మార్కెట్‌యార్డు నుండి నాలుగు రోడ్ల కూడలి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు రామయ్య, వీరశేఖర్, వెంకటశివ, సుబ్రమణ్యం, సుబ్బరాయుడు, సుబ్బారెడ్డి, బద్వేలు ఏరియా సహాయ కార్యదర్శి మస్తాన్, పట్టణ కార్యదర్శి బాలు, ఏరియా కార్యవర్గ సభ్యులు రమణ, ఇమ్మానుయేల్, రవికుమార్ పాల్గొన్నారు.

వైవీయూ జాతీయ సేవకులకు పురస్కారాలు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం జాతీయ సేవాపథకం పరిధిలో 2023–24 విద్యా సంవత్సరానికి విశ్వవిద్యాలయ స్థాయి జాతీయ సేవా పథకం పురస్కారాలను ప్రకటించింది. సమాజ సేవ, ప్రజా చైతన్యం, జాతీయ సమైక్యత వంటి కార్యక్రమాలలో విశేష కృషి చేసిన ఎన్ఎస్ఎస్ యూనిట్ల ప్రోగ్రాం ఆఫీసర్లు, వలంటీర్లు, ప్రోత్సాహం అందించిన కళాశాలల జాబితాను వైస్ చాన్స్‌లర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, అచార్య తప్పెట రామప్రసాదరెడ్డి, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ వెంకట్రామిరెడ్డి విడుదల చేశారు.

ఉత్తమ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు:

డి మానస, (యూనిట్ 9 వైవీయూ), ఐ మహబూబ్ బాషా (ఎస్.బి.ఎస్.ఎం. డిగ్రీ కళాశాల మైదుకూరు), మీనాక్షి (ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, కడప)ని ఎంపిక చేశారు.

ఉత్తమ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు:

డా.కె.శ్రీనివాసరావు (వైవీయూ), డాక్టర్ ఎం. దొరస్వామి నాయక్, (ఎస్.బి.వి.ఆర్ డిగ్రీ కళాశాల, బద్వేల్), బి. రవి కుమార్ (ఎస్.బి.ఎస్.వై.ఎం. డిగ్రీ కళాశాల, మైదుకూరు), జి.రఘురామయ్య (ప్రభుత్వ జూనియర్ కళాశాల, వీరబల్లి), డా.ఎల్.హేమలత క్రిష్ణవేణి (ఏపీ మోడల్ జూనియర్ కాలేజ్ పెనగలూరు) ఎంపికయ్యారు.

ఉత్తమ కళాశాలలు :

డాక్టర్ సి.యోగాంజనేయులు, (ప్రిన్సి పాల్, వైఎస్ఆర్.వి. గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్, వేంపల్లి), డాక్టర్ కె. వెంకటసుబ్బారెడ్డి(ప్రిన్సిపాల్, ఎస్.బి.వి.ఆర్. డిగ్రీ కళాశాల, బద్వేల్), షేక్ నూర్జహాన్ (ప్రిన్సిపాల్, ప్రభుత్వ బాలుర జూనియర్ కాలేజి)లను ఎంపిక చేశారు.

4న పురస్కారాల ప్రదానం..

జాతీయ సేవ దినోత్సవం సందర్భంగా ఈ నెల 4వ తేదీన జిల్లా వ్యాప్తంగా 5 మంది పీఓలకు, ముగ్గురు వలంటీర్లకు, కళాశాలల తరపున ముగ్గురు ప్రిన్సిపాళ్లకు పురస్కారాలను వీసీ ఆచార్య కృష్ణారెడ్డి, అధికారుల చేతుల మీదుగా ప్రదానం చేస్తామని తెలిపారు.

కానిస్టేబుల్‌పై హత్యాయత్నం ?



వైవీయూ వద్ద ప్రమాదంలో గాయపడ్డ కానిస్టేబుల్ శ్రీనువాసులురెడ్డి

పెండ్లిమర్రి: కడప–పులివెందుల ప్రధాన రహదారిలోని యోగి వేమన యూనివర్సిటీ రోడ్డులో సోమవారం అర్ధరాత్రి కానిస్టేబుల్ శ్రీనివాస్‌రెడ్డిపై హత్యాయత్నం జరిగినట్లు అనుమానిస్తున్నారు. విధి నిర్వహణలో భాగంగా వేంపల్లె నుంచి కడపకు కారులో వెళుతుండగా వైవీయూ వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాదానికి గురైన శ్రీనివాస్‌రెడ్డి వీయన్‌పల్లె మండలం మెయిళ్లచెరువు గ్రామానికి చెందిన వాడు. ఇతను వేంపల్లె పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కారు ఓ వైపు దెబ్బతిని ఉండటం చూసి ప్రమాదం జరిగిందని కొందరు అంటున్నారు. అయితే కానిస్టేబుల్ రెండు కాళ్లను గుర్తుతెలియని వ్యక్తులు రంపంతో కోసినట్లుగా ఉంది. దీంతో హత్యాయత్నం జరిగిందనుకుంటున్నారు. కానిస్టేబుల్ కారు డ్రైవ్ చేస్తుండగా కారులోని మరో వ్యక్తి చిన్నపాటి రంపపు కోత మిషన్‌తో అతడి కాళ్లపై దాడి చేసి పరారయ్యాడని కొందరు చెబుతున్నారు. ఈవిషయంపై పెండ్లిమర్రి ఎస్ఐ మధుసూదన్‌రెడ్డిని వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేని చెప్పారు. కారును స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం కానిస్టేబుల్ వేలూరు సీఎంసీలో చికిత్స పొందుతున్నాడు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

వల్లూరు (చెన్నూరు) : తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తూ ఇటీవల జిల్లాలో దొంగతనాలు అధికమవుతున్నాయి. ఇటీవల కడప ,రాజంపేటలో తాళం వేసిన ఇంటిని టార్గెట్ చేస్తూ దొంగలు బీభత్సం సృష్టించారు. ఇదే తరహాలో స్థానిక ఓల్డ్ బ్యాంకు వీధిలో పెడబల్లి రాజేశ్వరమ్మ ఇంటిలో గుర్తుతెలియని దుండగులు కిటికీ అమర్చిన ఇనప రాడ్డును కత్తిరించి ఇంట్లోకి ప్రవేశించి, ఇంటిని మొత్తం లూటీ చేశారు. బాధితురాలి కథనం మేరకు.. తన భర్త మరణించడంతో ఇంటిలో ఒంటరిగా ఉండలేక హైదరాబాద్‌లో కుమారుడి వద్ద ఉంటున్నాను. అయితే ప్రతినెలా తనకు ప్రభుత్వం ఇచ్చే వితంతు పెన్షన్ తీసుకునేందుకు ఒకటవ తేదీన తన ఇంటికి వచ్చేదాన్ని అని తెలిపింది. ప్రతి నెలలాగా మంగళవారం పెన్షన్ తీసుకునేందుకు వచ్చి ఇంటికి వేసిన తాళాన్ని తీయగా, ఇంటిలో బీరువాలు తెరిచి ఉండడంతో పాటు ఇంటిలోనే బట్టలు సామగ్రి చల్లాచెదురుగా పడి ఉన్నాయి. వెంటనే ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా బీరువాలో ఉన్నటువంటి సుమారు రూ. 80 వేల నగదు, 50 గ్రాముల బంగారు నగలు, ఒకటిన్నర కిలో వెండి అపహరించినట్లు తెలిపింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.